## క్లుప్తంగా

### ఓటర్లకు.. వైఎస్సార్ సీపీ శ్రేణులకు కృతజ్ఞతలు

**వైఎస్సార్ సీపీ పెడన అభ్యర్థి ఉప్పాల రాము**

**పెడన:** సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రచార పర్వంలో వెన్నంటే ఉన్న ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులకు, పోలింగ్ ప్రక్రియలో రాత్రి అయినా ఓర్పుతో ఓటేసిన ఓటర్లకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వైఎస్సార్ సీపీ పెడన ఎమ్మెల్యే అభ్యర్థి ఉప్పాల రాము మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జరిగిన ఎన్నికలు మన పెడన నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిశాయని, చిన్న చిన్న సంఘటనలు మినహా ఓటర్లు ఎంతో ఓర్పుతోను, చైతన్యంతో పోలింగ్‌లో పాలుపంచుకున్నారని పేర్కొన్నారు. బంధాలను, బంధుత్వాలను, స్నేహాన్ని ఎదిరించి వైఎస్సార్ సీపీ కోసం ఎంతో కష్టపడ్డారని తెలిపారు. ఈ ఎన్నికల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించి మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. నన్ను అభిమానించి వైఎస్సార్ సీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు అందుకుని దీవించి ఓట్ల రూపంలో ఆశీర్వదించిన ఓటరు దేవుళ్లకు దండాలని, మీకు రుణపడి ఉంటానని రాము తెలిపారు.

### ఘనంగా సాయి మందిరం ద్వితీయ వార్షికోత్సవం



**బంటుమిల్లి:** స్థానిక శ్రీ షిర్డీసాయి మందిర ద్వితీయ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజామునుంచే భక్తుల నగర సంకీర్తన, ఉదయం పండితుల వేద మంత్రాల మధ్య మన్యుసూక్త సహిత ఏకాదశ విభూతి అభిషేకం, సామూహిక సాయిసచ్చరిత్ర పారాయణం చేశారు. రాత్రి విష్ణుసహస్ర నామపారాయణ, దీపాలంకరణ, పల్లకీ సేవలు భక్తుల సాయినామ స్మరణలతో ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో బాబా ప్రధాన విగ్రహానికి స్వయంగా అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, పెద్దలు పాల్గొన్నారు.

### ఓటర్లకు ధన్యవాదాలు

**వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు**
**అవనిగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు**

**అవనిగడ్డ:** సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ సీపీ లోక్‌సభ అభ్యర్థి డాక్టర్ సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే అభ్యర్థి సింహాద్రి రమేష్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు. ఎండను సైతం లెక్క చేయకుండా ఎంతో ఓర్పుతో క్యూలైన్లో నిలబడి ఓటు హక్కు వినియోగించుకున్న అందరికీ ధన్యవాదాలు తెలిపారు. తమ గెలుపు కోసం అహోరాత్రులు కష్టపడి పని చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మీరు చూపించిన ఈ ఆదరాభిమానాలకు కృతజ్ఞతగా నిరంతరం ప్రజాసేవ కోసమే పని చేస్తామని వారు పేర్కొన్నారు.

### 18న వాసవీకన్యకా పరమేశ్వరికి ప్రత్యేక పూజలు

**నాగాయలంక:** స్థానిక పార్వతీసమేత కన్యకా పరమేశ్వరీ సమన్విత నగరేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 18న కన్యకా పరమేశ్వరీదేవి 4641వ జన్మదినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు మంగళవారం తెలిపారు. వైశాఖ శుద్ధ దశమి పురస్కరించుకుని గణపతి సచ్చిదానంద స్వామీజీ, కె.భానుప్రసాద్ దివ్యమంగళ ఆశీస్సులతో ఉదయం 9గంటలకు 108లీటర్ల ఆవుపాలతో కన్యకాంబకు పంచామృత అభిషేకాలు జరుగుతాయని పేర్కొన్నారు. సహస్రనామ కుంకుమార్చన, సామూహిక వాసవీమాత నామ పారాయణం చేస్తారని తెలిపారు. శ్రీవాసవీ సేవాదళ్ నిర్వహణలో సాయంత్రం 5గంటలకు అమ్మవారి ఉత్సవ విగ్రహంతో పురవీధుల్లో పల్లకీలో కృష్ణానది వరకు ఊరేగింపు, సాయంత్రం 7గంటలకు పవిత్ర కృష్ణానదిలో అమ్మవారికి తెప్పోత్సవం నిర్వహిస్తారు. అనంతరం 102మంది మహిళలతో కృష్ణానది తీరం నుంచి గ్రామంలోని దేవాలయం వరకు శ్రీవాసవి అమ్మవారికి దీపసమర్పణ తదితర కార్యక్రమాలు జరుగుతాయని దీపాలను దేవస్థానం సమకూర్చుతుందని సాంబశివరావు చెప్పారు.



# అవనిగడ్డలో ఓర్పుతో ఓటేశారు

- అవనిగడ్డలో 86 శాతం పోలింగ్
- గత ఎన్నికలతో పోలిస్తే 1.81 శాతం తక్కువ ఓటింగ్
- అత్యధికంగా ఎడ్లంక పోలింగ్ కేంద్రంలో 94.62 శాతం పోలింగ్



పెడన మండలం నందిగామలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళా ఓటర్లు

**అవనిగడ్డ:** నియోజకవర్గంలో ఓటర్లు చాలా ఓర్పుతో ఓటేశారు. మండుటెండను సైతం లెక్కచేయక గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చుని ఓటు హక్కు వినియోగించుకున్నారు. మహిళలు ఎంతో ఉత్సాహంతో ఓటు వేశారు. నియోజకవర్గంలో మొత్తం 2,11,331 ఓట్లకు 1,04,568 మంది పురుషులు, 1,07,745 మహిళా ఓటర్లు ఉన్నారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో మొత్తం 1,82,991 ఓట్లు పోలవ్వగా 91,116 మంది పురుషులు, 91,867 మహిళలు, 8 మంది ఇతరులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే 1.81 శాతం తక్కువ ఓటు నమోదైంది. 2019 ఎన్నికల్లో 2,08,289 ఓట్లకు గాను 1,82,289 ఓట్లు నమోదయ్యాయి.

**ఎడ్లంకలో రికార్డు స్థాయిలో 94.62 శాతం ఓటింగ్**

అవనిగడ్డ మండల పరిధిలోని ఎడ్లంకలో రికార్డు స్థాయిలో 94.62 శాతం ఓటింగ్ నమోదైంది. ఇక్కడ మొత్తం 743 ఓట్లకు 703 ఓట్లు నమోదు కాగా, రెండో స్థానంలో వేకనూరు పంచాయతీ పరిధిలోని గుడివాకవారిపాలెం పోలింగ్‌స్టేషన్ నిలిచింది. ఇక్కడ 322 ఓట్లకు 304 ఓట్లతో 94.41 శాతం నమోదుకాగా, అవనిగడ్డ రెండవ వార్డులోని ప్రాథమిక పాఠశాల పోలింగ్ స్టేషన్ మూడవ స్థానంలో నిలిచింది. ఇక్కడ 719 ఓట్లకు 676 ఓట్లతో 94.2 శాతం పోలింగ్ నమోదైంది.

**52 బూత్‌లలో 90 శాతానికి పైగా పోలింగ్**

నియోజకవర్గంలోని 52 పోలింగ్ బూత్‌లలో 90 శాతానికి పైగా ఓటింగ్ నమోదైంది. 107 పోలింగ్ బూత్‌లలో 85 నుంచి 90 శాతం మధ్య ఓటింగ్ నమోదైంది. మహిళలు పెద్ద ఎత్తున క్యూలైన్లలో నిలబడి ఓర్పుతో ఓటేయడం వైఎస్సార్ సీపీ నేతల్లో సంతోషం రేకెత్తిస్తుంది.



అత్యధిక శాతం ఓటింగ్ నమోదైన ఎడ్లంక పోలింగ్ కేంద్రం



పెడన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (బంగ్లా స్కూల్ )లో క్యూలో ఓటర్లు

**పెడనలో..**

**పెడన:** పెడన నియోజకవర్గంలో 2019 సార్వత్రిక ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో అధిక సంఖ్యలో ఓటర్లు పాల్గొని ఓటు వేయడం గమనార్హం. గత సార్వత్రిక ఎన్నికల్లో 87.74 శాతం నమోదుకాగా ఇప్పుడు 88.57 శాతం నమోదైంది. 0.83 శాతం పెరిగింది. పెడన నియోజకవర్గలో 1,67,564 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,48,413 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 83,008 మంది ఉంటే 74,384 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 8,624 పురుషులు ఓటు వేయలేదు. నియోజకవర్గంలో పురుషులు కంటే మహిళా ఓటర్లు 1,548 అధికంగా ఉన్నారు. అయితే పోలింగ్ విషయానికి వస్తే మహిళలు 74,029 మంది మాత్రమే పోలింగ్‌లో పాల్గొన్నారు. 10,527 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకోలేదు. పురుషులు కంటే మహిళలు 355 మంది తక్కువగా ఉన్నారు.

**గత ఎన్నికల్లో 1,45,826 మంది.. ఇప్పుడు 148,413**

2019 సార్వత్రిక ఎన్నికల్లో 1,66,177 మంది ఓటర్లు ఉంటే వీరిలో 1,45,826 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇప్పుడు 1,67,564 మందికి 1,48,413 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత సార్వత్రిక ఎన్నికలు కంటే ఇప్పుడు ఎన్నికలకు 2,587 మంది అధికంగా ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం.

**ఓటర్లు పోటెత్తారు**

**ఘంటసాల:** సార్వత్రిక ఎన్నికల్లో ఘంటసాల మండలంలో ఓటర్లు పోటెత్తారు. మండలంలోని 22 గ్రామాలకు సంబంధించిన 44 పోలింగ్ కేంద్రాల్లో 33,235 మంది ఓటర్లు ఉన్నారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో ఉదయం నుంచే ఓటర్లు క్యూ కట్టడంతో పాటు ఓట్లు పోటెత్తుతుండటంతో పోలింగ్ ముగిసే సమయానికి 28,695 మంది ఓట్లు వేయగా 86.34 శాతం ఓట్లు పోలైనట్లు అధికారులు వెల్లడించారు.

**భారీ వర్షాన్ని లెక్కచేయని ఓటర్లు**

ఎన్నికల సమయంలో మధ్యాహ్నం నుంచి వాతావరణం ఒక్కసారిగా మారడంతో ఘంటసాల పరిసర ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది.

అయినా పెద్దగూడెంలో ఓటర్లు క్యూలో నిలుచుని ఓటు వేశారు. ఘంటసాల మండలంలోని మిగిలిన ప్రాంతాల్లో కూడా ఓ మోస్తారు వర్షం కురవడంతో వాతావరణం చల్లబడటంతో ఉదయం నుంచి ఎండ వేడిమికి అల్లాడిపోయిన ఓటర్లు సేదతీరారు.

### గెలుపోటములపై కూడికలు తీసివేతలు

**పోలింగ్ సరళిపై చర్చలు**

**మచిలీపట్నంటౌన్:** సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగియడంతో నగరంలో అభ్యర్థుల గెలుపోటములపై చర్చలు కొనసాగుతున్నాయి. ఎక్కడ ముగ్గురు, నలుగురు చేరినా అభ్యర్థుల గెలుపోటములపైనే చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా టీస్టాళ్లు, కాలనీల్లోని కూడళ్లు, స్నేహితులతో కలిసిన సమయాల్లో ప్రతి ఒక్కరూ అభ్యర్థుల గెలుపోటములపైనే చర్చించుకుంటున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద గంటల కొద్దీ క్యూలైన్‌లో నిలబడి ఓటర్లు ఓట్లు వేయడం, మహిళలు, వృద్ధులు సైతం ఓటింగ్‌కు పెద్ద ఎత్తున హాజరుకావడం గెలుపోటములపై ఏ విధమైన ప్రభావం చూపుతుందోననే అంశంపై చర్చించుకుంటున్నారు. పోలింగ్‌కు మహిళలు, వృద్ధులు, వికలాంగులు సైతం హాజరై ఓటు హక్కును వినియోగించుకోవడంతో తమ పార్టీకే మేలు చేకూరుతుందని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అంచనా వేస్తున్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు)కు పెద్ద ఎత్తున క్రాస్ ఓటింగ్ వచ్చిందనే వాదనలు వినవస్తున్నాయి. గత ఎన్నికల్లో నియోజకవర్గంలో 80.78 శాతం ఓట్లు పోలవ్వగా వైఎస్సార్ సీపీ పేర్ని వెంకట్రామయ్య (నాని) విజయం సాధించారు. ఈ 2024 ఎన్నికల్లో జరిగిన పోలింగ్ 81.91 శాతంకు పెరగడంతో వైఎస్సార్ సీపీ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) విజయం సునాయాసమేనని చర్చించుకుంటున్నారు. గెలుపోటములపై అన్ని రాజకీయ పక్షాల అభ్యర్థులతో పాటు నాయకులు, కార్యకర్తలు, సామాన్య ప్రజలు చర్చించుకుంటున్నారు. పోలైన ఓట్లలో ఏయే ప్రాంతాల్లో కలిసొస్తుంది, ఏయే ప్రాంతాల్లో నష్టపోతామనే విషయాలపై చర్చించుకుంటున్నారు. ఏదేమైనా జూన్ 4వ తేదీన జరిగే కౌంటింగ్‌లో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.

## మోపిదేవిలో 88.85 శాతం పోలింగ్

**మోపిదేవి:** మండల పరిధిలో మొత్తం 38 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికలు సోమవారం ముగిశాయి. ఈ ఎన్నికల్లో మొత్తం 28,790 ఓట్లకు 25,580 ఓట్లు పోలైనట్లు అధికారులు తెలిపారు. మొత్తం మీద 88.85 శాతం పోలింగ్ అయినట్లు వివరించారు. మండలంలో 100 సంవత్సరాలు దాటిన ఇద్దరు వృద్ధ మహిళలు మెరకనపల్లికి చెందిన 105 ఏళ్ల యడ్ల రాజమ్మ, రావివారిపాలెంకు చెందిన 101 ఏళ్ల రావి లీలావతి ఓట్లు వేసి నేటి తరానికి ఆదర్శంగా నిలిచారు.



మెరకనపల్లిలో సహాయకులతో ఓటు వేయడానికి వస్తున్న వృద్ధురాలు రాజమ్మ

## ఏపీఆర్‌జేసీలో 'కొమ్మారెడ్డి'కి రాష్ట్రస్థాయి ర్యాంకులు

**బంటుమిల్లి:** స్థానిక కొమ్మారెడ్డి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఏపీఆర్ జేసీ సెట్-2024లో బైపీసీ విభాగంలో రాష్ట స్థాయి ర్యాంకులు సాధించారని పాఠశాల డైరెక్టరు కె. కిషోర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో వల్లూరిపల్లి శ్రీరామ్‌తేజ 42, జన్యావుల శ్రీకృష్ణతేజస్ 43, కొప్పనాతి శైలు 79 ర్యాంకులు రాష్ట్ర స్థాయిలో సాధించి తొలి కౌన్సిలింగ్‌లోనే ఏపీ ఆర్‌జేసీల్లో సీట్లు దక్కించుకునేందుకు అర్హత పొందారని వివరించారు. వీరితోపాటు కోడె దోలాసాయిరామ్ 330, చంద్రాల వెంకటసుబ్రహ్మణ్యం 332స్టేట్ ర్యాంకులు సాధించినట్లు ఆయన తెలిపారు. వీరిని కిషోర్, హెడ్‌మాస్టర్ ఎస్.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

## లెక్కింపు కేంద్రానికి బ్యాలెట్ బాక్సులు

**పెడన:** పెడన నియోజకవర్గంలోని 216 బూత్‌ల నుంచి ఈవీఎంలు, బ్యాలెట్ బాక్సులు లెక్కింపు కేంద్రానికి చేరుకున్నాయి. మచిలీపట్నం మండలం రుద్రవరంలోని కృష్ణా యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన లెక్కింపు కేంద్రానికి వీటిని తరలించారు. అక్కడ ఏర్పాటు చేసిన 16 ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఈవీఎంలు, బ్యాలెట్ బాక్సులను పీవోలు ఎన్నికల సిబ్బందికి అప్పగించడంతో స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచారు. వీటిని మంగళవారం అభ్యర్థులు, వారి ప్రతినిధుల సమక్షంలో స్క్రూటినీ చేసి సక్రమంగా ఉన్నాయి లేనిది పరిశీలించి స్ట్రాంగ్ రూంకు సీలు వేశారు. సీలు వేసే ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలాజీ, మచిలీపట్నం పార్లమెంటు పరిశీలకులు జాన్ కింగ్స్‌లేలు పరిశీలించారు. పెడన ఎన్నికల అధికారి పి.వెంకటరమణ తన సిబ్బందితో సీలు వేయించారు. జూన్ 4వ తేదీన లెక్కింపు రోజు ఉదయం ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థుల సమక్షంలో సీలు తీస్తారని, అప్పటి వరకు మూడంచెల భద్రత స్ట్రాంగ్ రూం వద్ద కొనసాగుతుందని ఈఆర్వో వెంకటరమణ స్పష్టం చేశారు.



కృష్ణా యూనివర్సిటీలో 'పెడన' స్ట్రాంగ్ రూం సీలును పరిశీలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ

## నాయకులు, కార్యకర్తలతో సమాలోచనలు



పార్టీ కార్యాలయానికి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో పేర్ని కిట్టు



పార్టీ కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పేర్ని నాని

**మచిలీపట్నంటౌన్:** పోలింగ్ ముగియడంతో వైఎస్సార్ సీపీ మచిలీపట్నం అసెంబ్లీ అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) మంగళవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమాలోచనలు జరిపారు. రెండు నెలలుగా ఎన్నికల కార్యకలాపాలతో బిజీగా గడిపిన ఆయన పోలింగ్ ముగియటంతో కార్యాలయంలో అందుబాటులో ఉన్నారు. నియోజకవర్గంలోని గ్రామాలు, నగరంలోని డివిజన్ల నుంచి వచ్చిన పార్టీ నాయకులు, కార్యకర్తలతో పోలింగ్ సరళిపై చర్చించారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద చోటు చేసుకున్న అంశాలపై ప్రతి ఒక్కరితో చర్చించారు. ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) కూడా పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉండి నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. వీరిద్దర్ని కలిసేందుకు నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.

## క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించిన శివవర్మ

**సంగమేశ్వరం(నాగాయలంక):** గ్రామ కమిటీ, గ్రామ పెద్దలు, యువత ఆధ్వర్యంలో మండల స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్‌ను మండల అగ్నికుల క్షత్రియ నేత, వైఎస్సార్ సీపీ బీసీ నాయకుడు కొక్కిలిగడ్డ శివవర్మ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టోర్నమెంట్‌లో మొదటి స్థానంలో గెలుపొందిన జట్టుకు రూ.25 వేల నగదు బహుమతిని శివవర్మ స్పాన్సర్ చేస్తున్నట్లు ప్రకటించారు. సర్పంచ్ నాయుడు నాగమల్లీశ్వరి వితరణతో రెండవ బహుమతి కింద రూ.15వేలు, నాయుడు వెంకటేశ్వరరావు తృతీయ బహుమతి కింద రూ.7వేలు, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ కింద కేఎస్ఎస్ సీ ఫుడ్స్ వారు మూడు వేలు నగదు బహుమతులను ప్రకటించారు. మ్యాచ్‌లు వారం రోజు పాటు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పెద్దలు, గ్రామస్తులు, పలు జట్లు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో లలితా పారాయణం



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



లలితా పారాయణం చేస్తున్న భక్తులు

**మచిలీపట్నంటౌన్:** నగరంలోని గాంధీబొమ్మ శివాలయం ఆవరణలో ఉన్న అయ్యప్ప ఆలయం 33వ ప్రతిష్టా మహోత్సవంలో భాగంగా మంగళవారం స్వామివారికి పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దాదాపు 100 మందికి పైగా సుహాసినిలు శ్రీ లలితా పారాయణం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం శ్రీ లలితా హోమం, శ్రీ లక్ష్మీగణపతిహోమం, లక్ష మల్లెలతో స్వామివారికి పూజ కార్యక్రమం నిర్వహించనున్నారు. సాయంత్రం దాదాపు 1000 మంది సుహాసినిలతో సామూహిక కుంకుమార్చన జరగనుంది. పూజలో పాల్గొనే సుహాసినీలకు పసుపు, కుంకుమగా చీరలు ప్రసాదంగా అందజేస్తారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**మచిలీపట్నంటౌన్:** విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 15వ తేదీ బుధవారం నగరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ ఎం.భాస్కరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు మౌనిక అపార్ట్‌మెంట్, హౌసింగ్ బోర్డు సబ్‌స్టేషన్ పక్కనున్న ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

## అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

**హనుమాన్‌జంక్షన్‌రూరల్:** స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు.

అభయాంజనేయుడికి తమలపాకులతో ప్రత్యేక పూజలు వైభవంగా జరిగాయి. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు తవ్వా శ్రీనివాస గుప్తా సహకారంతో అన్న ప్రసాద వితరణ చేశారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

## మజ్జిగ పంపిణీ



మజ్జిగ పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

**గుడివాడ టౌన్:** మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ సేవా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం స్థానిక రైల్వేస్టేషన్‌లో మజ్జిగ పంపిణీ చేశారు. సంస్థ జిల్లా అధ్యక్షుడు పీవీ శేషగిరిరావు వితరణతో పంపిణీ చేసినట్లు గుడివాడ శాఖ అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ట్రెజరర్ గోపిరెడ్డి, డైరెక్టర్ దండమూడి సీతారామస్వామి, టి.రామ్మోహనరావు, జి.రామకృష్ణ, జి.చంద్రశేఖరరావు, టి.ఉమాదేవి పాల్గొన్నారు.

**రామవరప్పాడు:** విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో బాటసారులు, ప్రయాణికులకు అందిస్తున్న ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రం విజయవంతంగా కొనసాగుతోంది. ఈ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి దాతల సహకారంతో ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. మంగళవారం దాతలు ఆసిలేటి స్వర్ణకుమారి, రాధికల సహకారంతో బాటసారులు, ప్రయాణికులకు మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్ మాట్లాడుతూ.. దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఉచిత మజ్జిగ పంపిణీకి సహకరిస్తున్నారన్నారు. వేసవి ముగిసే వరకూ ఈ శిబిరాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

## పచ్చిరొట్ట సాగుతో ప్రయోజనాలు



సాగులో ఉన్న జనుము(ఫైల్)

**గన్నవరంరూరల్:** వ్యవసాయంలో పచ్చిరొట్ట ఎరువుల ప్రాధాన్యతను గుర్తించి రైతులు సాగు చేయడం ద్వారా ప్రయోజనాలు పొందవచ్చని మండల వ్యవసాయాధికారి ఎస్ఎల్ తేజస్వి సూచించారు. ఖరీఫ్ ప్రారంభానికి ముందుగా కురిసే జల్లులు సమయంలోనే పచ్చిరొట్ట పైర్లు సాగు చేయాలని మంగళవారం తెలిపారు. జనుము, జీలుగ, పిల్లి పెసర సాగు చేయాలన్నారు. దీంతో భూమిలో పోషకాలు పెరిగి భూమి ఆరోగ్యంగా బాగుంటుందని చెప్పారు. పచ్చిరొట్ట పైర్లు నేలలో కలియదున్నడం ద్వారా నేలకు తగిన మోతాదులో సేంద్రియ కర్బనం, నత్రజని నేలకు అందుతాయని, దీంతో భూసారం పెరుగుతుందన్నారు. భూమి గుల్లగా మారి నేలలోనికి నీరు ఇంకే గుణం పచ్చిరొట్ట సాగుద్వారా కలుగుతుందని, నేలలు కోతకు గురి కాకుండా ఉంటాయని చెప్పారు. సూక్ష్మ జీవులు పెరిగి, జీవ రసాయనిక చర్యల ద్వారా నేల సారం పెరిగి నేల సంపూర్ణ ఆరోగ్యవంతం అవుతుందని తెలిపారు.

## మండుటెండలో.. పోలింగ్ కేంద్రాలకు వృద్ధులు, బాలింతలు

**ఘంటసాల:** ఎన్నికల సందర్భంగా ఘంటసాల పెద్దగూడెంకు చెందిన 53 ఏళ్ల ఉన్న మానసిక అంగవైకల్యంతో బాధపడుతున్న పైడిపాముల నిర్మల జ్యోతిని గ్రామానికి చెందిన కొడాలి సమాయేలు ఇతరుల సహకారంతో ఓటు వేయించారు. శ్రీకాకుళంలో మండే ఎండలో పలువురు మహిళలు చంటి బిడ్డలతో వచ్చి ఓటు వేసేందుకు వచ్చారు. ఘంటసాల మండలంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు ఎస్ఐ కె.ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పోలీసులు, కేంద్ర బలగాల సమన్వయంతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయగా చల్లపల్లి సీఐ నాగప్రసాద్ శ్రీకాకుళంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.